

శ్రీనుకు ఎంఎల్ఏ జ్యోతుల పరామర్శ



గోకవరం : అస్వస్థతకు గురైన టిడిపి సీనియర్ నాయకులు, టిడిపి బిసి సెల్ మండల అధ్యక్షులు రాయవరపు శ్రీనును జగ్గంపేట ఎంఎల్ఏ జ్యోతుల నెహ్రూ గురువారం పరామర్శించారు. ఆయన యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ మంగరౌతు రామకృష్ణ, సొసైటీ మాజీ ఛైర్మన్ దాసరి తమ్మన్న దొర, సొసైటీ మాజీ ఛైర్మన్ గాజింగం సత్తిబాబు, ఎంపిటిసి మాజీ సభ్యులు పులపర్తి బుజ్జి, టౌన్ కన్వీనర్ పోసిన ప్రసాద్, మండల రైతు అధ్యక్షులు చింతల రామకృష్ణ,పైలా శ్రీనివాసరావు, గళ్ళ రాము తదితరులు పాల్గొన్నారు.

రక్షణ చట్టాలు... కఠిన శిక్షలు అవసరం



మహిళలపై ఏదొక మూల ఏదొక అఘాయిత్యం నిత్యం జరుగుతూనే ఉన్నాయి. కోల్‌కతా ఘటన మరింత అమానవీయం. ప్రాణాలు పోసే డాక్టర్లకే ప్రాణాపాయం కలుగుతుంటే ఇక విధులు ఏం నిర్వహిస్తాం... రోగులకు ప్రాణాలు ఎలా పోస్తాం... అని ప్రశ్నిస్తున్న వైద్యులు, సిబ్బంది. రక్షణ చట్టాలు చేయాలని, కఠిన శిక్షలు అమలు చేయాలని, అప్పుడే ఇటువంటి ఘటనలను కట్టడిచేయొచ్చని అంటున్నారు వారు. కోల్‌కతా ఘటన నేపథ్యంలో పలువురు వైద్యులు, ఆ రంగంలో పనిచేస్తున్న సిబ్బంది తమ వాణిని ఇలా వినిపించారు... వారి మాటల్లోనే.

రక్షణ కోసం పోరాటం



ఈ సమ్మె ప్రారంభించింది కేవలం కోల్‌కతా ఘటనపై నిరసన మాత్రమే కాదు. ఆరోగ్య కార్యకర్తలు, ముఖ్యంగా రాత్రిపూట డ్యూటీ చేస్తున్న మహిళా డాక్టర్లు ఎదుర్కొన్న ప్రమాదాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలనే విజ్ఞప్తి కోసం చేస్తున్నాం. కావున ప్రభుత్వం వెంటనే ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా రక్షణ చట్టాలు చేయాలి.

- డాక్టర్ దాసరి రోహిత్, జూనియర్ వైద్యులు, జిజిహెచ్, కాకినాడ

ప్రభుత్వాలు కళ్లు తెరవాలి



కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలి. దేశ వ్యాప్తంగా వైద్య సిబ్బంది రక్షణకు సమగ్ర చట్టం చేయాలి. నిందితులతో పాటూ నిందితులను కాపాడాలనుకునే వారికి కఠిన శిక్ష విధించాలి. దేశంలో అన్ని స్థాయిల్లో లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు ఏర్పాటు చేయాలి. అందరి ప్రాణాలు కాపాడే వైద్యులకే ఇటువంటి పరిస్థితి ఏర్పడితే ఇక సామాన్యుల పరిస్థితి ఏంటి? ప్రభుత్వాలు ఇప్పటికైనా కళ్లు తెరవాలి. కఠినమైన చట్టాలు అమలు చేయాలి.

- ఎ.ఇంద్రావతి, ప్రభుత్వ వైద్యురాలు, అమలాపురం

విధులకు రావాలంటే భయం వేస్తుంది



వైద్య వృత్తి చాలా కీలకమైనదిగా భావిస్తున్నాం. అయితే ఇటీవల జరిగిన ఘటనను చూసి భయం భయంగా గడపాల్సి వస్తుంది. రాత్రిపూట డ్యూటీకి వెళ్లడం మరింత భయంకరంగా మారింది. మేము రోగుల జీవితాలను కాపాడటానికి కృషి చేస్తుంటాం. కానీ ఇప్పుడు మా ప్రాణాల కోసం భయపడాల్సిన పరిస్థితి వచ్చింది. సెంట్రల్ ప్రొటెక్షన్ చట్టం తీసుకురావాలి. దీని కోసమే మా ఆందోళనలు.

- డాక్టర్ తేజశ్రీ, జూనియర్ డాక్టర్, జిజిహెచ్, కాకినాడ

పునరావృతం కారాదు...



వైద్యులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలి. అత్యాచార నిందితులను బహిరంగంగా ఉరితీసే చట్టాలు చేయాలి. జరిగిన ఘటనపై వివిధ రూపాల్లో ఆందోళనలు చేశాం. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కూడా అత్యవసర సేవలు మినహాయించి ఓపిని నిలిపివేసి ఆందోళనలు చేశాం. ప్రజల కూడా మద్దతు తెలిపారు.

- డాక్టర్ పార్వతి చంద్రాభట్ల, జూనియర్ డాక్టర్, కాకినాడ

ప్రభుత్వానిదే బాధ్యత



జూనియర్ వైద్యురాలి ఘటనపై పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలి. ఓ మహిళా ముఖ్యమంత్రి సారథ్యం వహిస్తున్న రాష్ట్రంలో ఇటువంటి ఘోరం చోటు చేసుకోవడం బాధాకరం. అక్కడి పాలక పక్షం ఆత్మ విమర్శ చేసుకోవాల్సిన అవసరం ఉంది. కాలేజీలు మొదలుకుని, యూనివర్శిటీలు, పనిప్రదేశాలలో మహిళలపై వేధింపులు కొనసాగుతున్నాయి. పురుషాధిపత్యం కొనసాగుతోంది. ఈ పరిస్థితులు మారాల్సిన అవసరం ఉంది. మహిళలకు రక్షణ కల్పించేలా చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి. దోషులు ఎంతటి వారైనా శిక్షించాలి.

- ఎస్.కృష్ణ, మెడికల్ రిప్రజెంటేటివ్, రాజమహేంద్రవరం

కఠిన చర్యలు ఉండాలి



వైద్యులపై దాడులు నిత్యం జరుగుతున్నాయి. వైద్య వృత్తిలో అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నాం. పని ప్రదేశంలో భద్రత లేకుండా పోయింది. ఇలాంటి పరిస్థితుల నడుమ విధులను నిర్వహించడం కూడా కష్టమే. దాడులకు దిగుతున్న వారిపై కఠిన చర్యలు ఉండాలి. ఈ మేరకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి.

- డాక్టర్ బి.అమృతవల్లి, జూనియర్ డాక్టర్, జిజిహెచ్ కాకినాడ

సామాజిక బాధ్యతగా హరిత ఆంధ్రప్రదేశ్

సమీక్షా సమావేశంలో కలెక్టర్ పి ప్రశాంతి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

సామాజిక బాధ్యతగా హరిత ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి డివిజన్, మండల స్థాయి, మండల ప్రత్యేక అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. హరిత ఆంధ్రప్రదేశ్, ఎన్‌టిఆర్ భరోసా పించన్ల పంపిణీపై దిశా నిర్దేశనం చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడారు. హరిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని ఒక సామాజిక బాధ్యత చేపట్టి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆగస్ట్ 29 నుంచి నవంబరు 1వ తేదీ వరకూ ఆమేరకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రతీ రోజూ ఒక్కో విభాగానికి ఒక్కో రోజు కేటాయించడం ద్వారా మొక్కలు నాటే కార్యక్రమం మరింత సమర్థవంతంగా జరుగుతుందన్నారు. 'అమ్మ పేర ఒక మొక్క' నాటి సంరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధిహామీ పథకం కింద మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించడం కోసం ఎంపిడిఒకు ప్రతిపాదనలు పంపాలన్నారు. ప్రభుత్వాలు శ్మశాన వాటికలు, కెనాల్ బండ్లు పాఠశాలలో కాలేజీలలో, పరిశ్రమలలో ఆవరణలో మొక్కలు నాటి కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులను ఉన్న స్థాయి అధికారులను భాగస్వామ్యం చేయాలన్నారు. సెన్సాయి సంఘాల సభ్యులతో ఆధ్వర్యంలో ఇంటి వద్ద కరేపాకు. మునగాకు వంటి మొక్కలు నాటాలన్నారు. రాష్ట్రంలోని 24 శాతం నుండి 33 శాతం వరకు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

పచ్చదనం పెంచడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

ఆగస్టు 31న పెన్షన్ల పంపిణీ

ఆగస్టు 31నే పెన్షన్లను పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 512 సచివాలయాల పరిధిలో 2,39152 మంది పెన్షన్ లబ్ధిదారులకు 9,041 క్లస్టర్ పరిధిలోని 5,169 మంది పెన్షన్ పంపిణీ అధికారులను భాగస్వామ్యం చేస్తున్నట్లు తెలిపారు. ఉదయం 5 గంటలకే పెన్షన్లను పంపిణీ ప్రక్రియ ప్రారంభించాలన్నారు. దీనికి అనుగుణంగా జిల్లా, మండల, పీడీ, డిఆర్‌డిఎ ఆధ్వర్యంలోని కంట్రోల్ రూం విధుల్లో ఉండాలన్నారు. ఆగస్టు 31 శనివారం ఉదయం 5 గంటలకు పెన్షన్ పంపిణీ ప్రారంభించి 12 గంటలకల్లా పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. దీని కనుగుణంగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజా ప్రతినిధుల సమక్షంలో పింఛను అందించాలన్నారు. పెన్షన్ నగదు ఇవ్వడానికి, రసీదు తీసుకోవడానికి అనుగుణంగా సిబ్బందిని నియమించుకోవాలని కలెక్టర్ తెలిపారు.

పరిశోధనల వైపు పయనించాలి

ప్రజాశక్తి - రాజానగరం

నూతన ఆలోచనలతో పరిశోధనల వైపు పయనించాలని గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ పిఎంఎంఎస్.శర్మ అన్నారు. భారత సాంకేతిక విద్యా మండలి ప్రారంభించిన వాణి పథకంపై విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని గైట్ అటానమస్ కళాశాలలో పెట్రోలియం విభాగం ఆధ్వర్యంలో ఎఐసిటిఇ సౌజన్యంతో గురువారం వర్క్‌షాప్ ప్రారంభమైంది. 'విద్యుత్ వాహనాల వేస్ట్ బ్యాటరీ నుంచి పర్యావరణంపై పడుతున్న ఇటీవల పరిణామాలు' అనే అంశంపై నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని శర్మ పాల్గొని మాట్లాడారు. పారిశ్రామిక రంగ నిపుణులు, విద్యారంగంలో నిష్ణాతులైన వారి నుంచి నూతన విషయాలు తెలుసుకోవడానికి వారి ఆలోచనలను పంచుకోవడానికి మంచి విజ్ఞాన వేదికగా ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. వాణి పథకంపై వర్క్ షాప్‌నకు దేశవ్యాప్తంగా 1,300 కళాశాలలు దరఖాస్తు చేయగా అందులో ఎంపికైన వంద కళాశాలలో గైట్ ఒకటి అన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన గైట్ అటానమస్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.జయానందకుమార్ మాట్లాడుతూ బోధన అభ్యాసన అనుభవాన్ని మెరుగుపరచడానికి ఎఐసిటిఇ వాణి పథకం ప్రారంభించిందన్నారు. విద్యుత్ వాహనాల వినియోగంలో భవిష్యత్తులో పర్యావరణంపై ఎలాంటి ప్రభావం చూపుతుందనే దానిపై చర్చ జరుగుతుందన్నారు. విద్యుత్ వాహనాలపై విద్యార్థులకు స్వీయ సాధన అవగాహన కల్పిస్తారని తెలిపారు. తొలుత అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సమావేశంలో పెట్రోలియం విభాగాధిపతి, వర్క్ షాప్ కోఆర్డినేటర్ ఎమ్‌డి.మహ్మద్ షరీఫ్, కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎన్‌విఆర్ నాగలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌విఎస్‌ఎన్. మూర్తి, వివిధ విభాగాధిపతులు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

అవార్డు రేసులో 'బంగారు కొండ'

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

తూర్పు గోదావరి జిల్లాలో చేపట్టిన 'బంగారు కొండ' కార్యక్రమం స్కాచ్ అవార్డు రేసులో నిలిచింది. సెమీ ఫైనల్స్‌కి ఎంపిక కావడం పట్ల కలెక్టర్ పి.ప్రశాంతి హర్షం వ్యక్తం చేశారు. గతంలో కలెక్టర్‌గా పనిచేసిన డాక్టర్ కె.మాధవీలత ఈ కార్యక్రమానికి నాంది పలికారన్నారు. రక్తహీనత, వయస్సుకు తగ్గ ఎదుగుదల లేని, ఎత్తుకు తగ్గ బరువు లేని పిల్లల్ని గుర్తించి వారిని సాధారణ స్థితికి తీసుకుని రావడంలో ప్రజలను భాగస్వామ్యం చేయడం, సామాజిక బాధ్యత పట్ల ఆసక్తి పెంచడం కోసం దీనికి శ్రీకారం చుట్టారన్నారు. వాటిని మరింత పారదర్శకంగా, జవాబుదారీతనం ఉండేలా అప్పటి జెసి ఎన్.తేజ్‌భరత్ సాంకేతిక పరిజ్ఞానంను రూపకల్పన చేసినట్లు తెలిపారు. దీన్ని మరింత బలోపేతం చేసేందుకు బంగరుకొండ ప్లస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో ప్రభుత్వ ఉద్యోగులు, కార్పొరేట్ సంస్థలు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంధ సంస్థలను భాగస్వామ్యం చేసేలా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. స్త్రీ శిశు సంక్షేమ అధికారులు స్కాచ్ ప్రశంస పత్రం కింద బంగారు కొండ కార్యక్రమానికి 4500 పైగా ఓట్లు దక్కించుకుని సెమీఫైనల్లో స్థానం దక్కించుకున్నట్లు తెలియ చేశారు.

డ్వాక్రా అవకతవకలపై దర్యాప్తు చేపట్టాలి

ప్రజాశక్తి-కడియం

మండలంలోని కడియపులంక గ్రామంలో ఇటీవల డ్వాక్రా సొమ్ములు అవకతవకలు జరిగాయని సంఘ సభ్యులు ఆరోపిస్తుండడంతో ఉన్నత స్థాయి అధికారులతో దర్యాప్తు చేయించాలని సర్పంచ్ పాఠంశెట్టి రాంజీ కోరారు. గురువారం ఆయన స్థానిక పాత్రికేయులతో మాట్లాడారు. ప్రస్తుతం మూడు గ్రూపులకు సంబంధించి సుమారుగా రూ.20 లక్షలు డ్వాక్రా యానిమేటర్ గోల్‌మాల్ చేశారని సభ్యులు తెలిపారన్నారు. అన్ని డ్వాక్రా గ్రూపులను పరిశీలిస్తే మరింత అవకతవకలు బయటపడే అవకాశం ఉందన్నారు. ఇందులో కొందరి అధికారుల హస్తం ఉండే అవకాశం ఉందన్నారు.

ఎంఎల్‌సి ఓటరు నమోదుపై స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉమ్మడి తూర్పు- పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయుల నియోజకవర్గానికి సంబంధించి ఓటరు నమోదు నిమిత్తం స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్ తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గురువారం ఉండ్రాజవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు ఎంఎల్‌సి ఓటరు నమోదు ఫారం-19 గురించి, దరఖాస్తు విధానం, అర్హతలు, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. దరఖాస్తు ఫారాలు తహశీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల్లో లభిస్తాయని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు సెప్టెంబర్ 3 చివరితేదీ అని తెలిపారు. యుటిఎఫ్ జిల్లా సహాయ అధ్యక్షులు ఐ.రాంబాబు పూర్తిచేసిన దరఖాస్తును తహశీల్దార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జివిఎస్.రామకృష్ణంరాజు, ఎంఇఒ సిహెచ్.సక్సేనారాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జాతీయ క్రీడా దినోత్సవం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం

జాతీయ క్రీడా దినోత్సవాన్ని జిల్లాలో గురువారం ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా క్రీడాకారులను సన్మానించారు. జాతీయస్థాయి ట్యాక్వాండో 73 కేజీల విభాగంలో వెండి పతకం సాధించిన గుబ్బల మేరీగోల్డ్, జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్‌లో బంగారు పతకం సాధించిన నల్ల ప్రజ్ఞ, సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టిటిలో పాల్గొన్న గౌతమ్, జాతీయ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నీ అండర్-13 విభాగంలో పాల్గొన్న వెంకటచైతన్య, 46వ జాతీయస్థాయి ఇండియన్ మాస్టర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్‌లో పాల్గొన్న డి.రుద్ర కుమార్, జాతీయ బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించిన కె.దివ్యశ్రీ, అంతర్జాతీయ మానస్ ఇండో బాంగ్లా ఫ్రెండ్‌షిప్ కప్



క్రీడాకారులను సత్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

2023 వీల్ చైర్ క్రికెట్ టీం టీ 20లో పాల్గొన్న ఎం.ప్రవీణ్ కుమార్, 3వ జాతీయ కరాటే, కుంగ్‌ఫూలో గోల్డ్ మెడల్ సాధించిన వివి.కిరణ్మయి, 67వ జాతీయ స్కూల్ గేమ్స్ 23-24 అండర్ 19 విభాగంలో బాక్సింగ్‌లో పాల్గొన్న జి.అక్షిత, 2వ ఎన్‌వైఎస్‌ఎఫ్ జాతీయ యోగా పోటీలలో పాల్గొని గిన్నిస్ రికార్డ్ సాధించిన వి.సాత్వికలను కలెక్టర్ ప్రశాంతి సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ జి.నరసింహులు, కెఆర్‌ఆర్‌సి ఎస్‌డిటి ఆర్.కృష్ణనాయక్, జిల్లా క్రీడా అధికారి డివివి శేషగిరి , డిటిడబ్ల్యూఒ కెఎస్.జ్యోతి, కోచ్‌లు పాల్గొన్నారు.

రాజానగరంలో గోదావరి గ్లోబల్ విశ్వ విద్యాలయంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వ హించారు. విసి డాక్టర్ యు.చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, జిజియు రిజిస్ట్రార్ డాక్టర్ పిఎంఎంఎస్.శర్మ, ప్రిన్సిపల్ డాక్టర్ టి.జయానందకుమార్, పీడీ డాక్టర్ సి.మంగ్రేకర్‌హేన్రీ, డైరెక్టర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఫీవర్ సర్వే

ప్రజాశక్తి - పెరవలి

పెరవలి, కానూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది ఫీవర్ సర్వేను నిర్వహించారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా జ్వరాలు ప్రబలడంతో ఈ సర్వేను నిర్వహిస్తున్నామని వైద్యాధికారులు డాక్టర్ ఎహెచ్.విజయకుమార్, డాక్టర్ హేమరాజ్ తెలిపారు. పరిసరాల పరిశుభ్రత, నీటి కుంటలు లేకుండా చేయడం, దోమలు, లార్వా లేకుండా చేయడం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత విషయంలో సంబంధిత పంచాయతీ కార్యదర్శితో సమన్వయం చేసుకుంటున్నామని తెలిపారు. పెరవలి, అజ్జరం గ్రామాల్లో వైద్య శిబిరం నిర్వహించామన్నారు.

ఉండ్రాజవరం : ప్రభుత్వ ఆదేశాలు మేరకు మండలంలోని గ్రామాల్లో మూడు రోజుల పాటు ఫీవర్ సర్వే కోసం మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయనున్నట్లు పిహెచిసి వైద్యాధికారి ఆర్.ఉషాదేవి తెలిపారు. దీనిలో భాగంగా గురువారం వెలగదుర్రులో సర్వే నిర్వహించినట్లు ఆమె తెలిపారు. సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎం.సుబ్రహ్మణ్యం, ఆరోగ్యకార్యకర్త కుమారి, ఎంఎల్‌హెచ్‌పి కనకదుర్గ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దేవరపల్లి : త్యాజంపూడి - యర్నగూడెం రహదారిలో మరమ్మతు పనులను ప్రారంభించారు. పిన్నమనేని కేశవరావు కొన్ని సంవత్సరాలుగా లక్షలాది రూపాయలు వెచ్చించి గోతులను పూడ్చే పనులు చేపట్టారు. శశి, జోసెఫ్ స్కూల్ యాజమానాన్యాలు తమవంతుగా సహకరించాయి. త్యాజంపూడి నుంచి పొంగుటూరు వరకూ మరమ్మతులు చేలని గతంలో టిడిపి, జనసేన, స్వచ్ఛంద సంస్థల నాయకులు ఎన్నో ఉద్యమాలు చేశారు. ఈ సమస్య పరిష్కార దిశగా ప్రభుత్వం గోతులను పూడ్చి రాదారి సుగమనం చేసేందుకు పనులు ప్రారంభించింది. దీనిపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గోపాలపురం : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నదేవరపేట పిహెచ్సి వైద్య అధికారిణి బి.నవ్యశ్రీ అన్నారు. గురువారం మండలంలోని చిట్యాల విలేజ్ హెల్త్ క్లినిక్ కేంద్రం వద్ద ప్రథమ చికిత్స వైద్య శిబిరం ఏర్పాటు సుమారు వంద మందికి ఓపి నిర్వహించి రక్త పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైద్య అధికారిని నవ్యశ్రీ మాట్లాడుతూ ప్రస్తుతం సీజనల్ వ్యాధులు వస్తున్నాయన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది హర్షిని, గంగాభవాని ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

చాగల్లు : మార్కొండపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గురువారం 135 మందికి వైద్య పరీక్షలు చేశారు. గ్రామాల్లో ఫీవర్ సర్వే నిర్వహించామని పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ పి.రవికుమార్ తెలిపారు. చంద్రవరం, కొవ్వూరు మండలం మద్దూరు, మద్దూరు లంకల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించామన్నారు. 149 మందికి రక్తపరీక్షలు నిర్వహించామని డాక్టర్ టి.అరుణరాయి తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్ సికె.కనకరత్నం, హెచ్.వి నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఎస్ఐగా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉండ్రాజవరం ఎస్ఐగా గుబ్బల శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల సూచనలు, మండల ప్రజలు, సిబ్బంది సహకారంతో బాధ్యతాయుతంగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తానన్నారు ఉండ్రాజవరం సరిహద్దు మండలాల్లో పనిచేసిన కారణంగా మండలంపై తనకు అవగాహన ఉందన్నారు. గతంలో తాను విజయవాడ, తణుకు, ఇరగవరం, నిడదవోలు, ఏలూరులో పనిచేశానని తెలిపారు. మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా విధులు నిర్వహిస్తానన్నారు. ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఇప్పటివరకు ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన వి.అప్పలరాజు రాజమండ్రికి బదిలీ అయ్యారు.

అంధత్వ నివారణపై ర్యాలీ

ప్రజాశక్తి - చాగల్లు

అంధత్వ నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని చాగల్లు వైద్యాధికారి డాక్టర్ తనూజ అన్నారు. గురువారం చాగల్లులో జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు సందర్భంగా ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఎన్.తనూజ మాట్లాడుతూ నేత్రదానంపై అవగాహన పెంచుకోవాలన్నారు. మరణానంతరం నేత్రాలు దానం చేసి మరోపరికి చూపును ప్రసాదించాలని తెలిపారు. మరణించిన ఆరు గంటల్లోపు కార్నియాను సేకరించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ మనోజ్, పిహెచ్ఎన్ జమీల, ఆరోగ్య పర్యవేక్షకులు ఎన్ఎల్‌కె ప్రభావతి, ఎంఎల్‌హెచ్‌పిలు, హెల్త్ అసిస్టెంట్లు సత్యనారాయణ, నెహ్రూ, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

ఆర్ట్స్ కళాశాలలో జాతీయ వర్క్‌షాపు

రాజమహేంద్రవరం : స్థానిక ఆర్ట్స్ కళాశాలలో వాణిజ్య, నిర్వహణ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'నిర్వహణ యొక్క అవకాశాలు మరియు సవాళ్లు' అనే అంశంపై గురువారం ఒక రోజు జాతీయ కార్యశాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్స్‌గా తమిళనాడు, కేంద్ర విశ్వవిద్యాలయ నిర్వహణ శాస్త్ర ఆచార్యులు ఎ.చంద్ర మోహన్, ఆంధ్రప్రదేశ్ ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయ, పారి స్కూల్ ఆఫ్ బిజినెస్, ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టిస్ డి. సత్యనారాయణ హాజరయ్యారు. ఎ.చంద్రమోహన్ అను భవ పూర్వక అభ్యాసాన్ని విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర మాట్లాడారు. నిర్వహణ అనేది అన్నింటిలో అవసరం అన్నారు. ఐక్యూఎసి సమన్వయ కర్త, డాక్టర్ ఎఎ.అన్నపూర్ణ వాణిజ్య, నిర్వహణ శాఖ నివేదికను సమర్పించారు. దీనికి కన్వీనర్ డాక్టర్ పివివి.సత్యనారాయణ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌జెడి జోన్-2 డాక్టర్ ఎస్.శోభారాణి, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ జి.సుధాకర్, ఆధ్యాపకులు, పారిశ్రామిక వ్యక్తులు విద్యార్థులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

ప్రజాశక్తి - యంత్రాంగం

తెలుగు భాష దినోత్సవాన్ని గురువారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగ గిడుగు రామ్మూర్తి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు కవులను సత్కరించారు. **రాజమహేంద్రవరం రూరల్** కలెక్టరేట్‌లో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి కలెక్టర్ ప్రశాంతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గిడుగు కృషి వల్లే తెలుగు భాషకి మంచి ప్రాచుర్యం లభించిందన్నారు. తెలుగు వారు ప్రతి ఒక్కరూ తెలుగులో చదవడం, రాయడం, మాట్లాడటం చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యతగా తెలుగు ఉపాధ్యాయులు గొల్లపల్లి సత్యనారాయణ వ్యవహరించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులను, విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెసి ఎస్.చిన్నరాముడు, డిఆర్ఒ జి.నరసింహులు, జిల్లా విద్యాధికారి కె.వాసుదేవరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **రాజమహేంద్రవరం** జిల్లా విద్యాశాఖ కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ వి.వెంకట్రాజు ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అర్బన్ రేంజ్ డిఐ బి.దిలీప్ కుమార్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అన్ని పాఠశాలల్లోనూ తెలుగు భాష దినోత్సవాన్ని నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయ ఎడి ఛాయాదేవి, సిఎంఒ శ్రీనివాస్, డిఇఒ కార్యాలయ సిబ్బంది, సమగ్ర శిక్షా కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. **రాజానగరం** గెట్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పివిబి.సంజీవరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. ఈ సభకు అధ్యక్షత వహించిన ప్రిన్సిపల్ డాక్టర్ వల్లిమాధవి మాట్లాడుతూ తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు సంస్కారం నేర్పించాన్నారు. సంస్కృతి తల్లి భాషతోనే అలవడుతుందన్నారు. ఈ కార్యక్రమాల్లో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. **చాగల్లు** మండలం చంద్రవరం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో తెలుగు దినోత్సవాన్ని, క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఆర్.రమాంబ, ఉపాధ్యాయులు ఎన్.శ్రీనివాస్, ఎన్.రాధాకృష్ణ, ఎస్.హేమారావు, సిహెచ్.చల్లారావు పాల్గొన్నారు. **దేవరపల్లి** భాష్యం స్కూల్లో తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు తెలుగులో వక్తృత్వ, వ్యాసరచన పోటీలను నిర్వహించి బహుమతులను అందించారు. ప్రిన్సిపల్ పి.పేరయ్యనాయుడు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చాంప్స్ ప్రిన్సిపల్ షేక్‌షబానా, వైస్ ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **చాగల్లు** తహశీల్దార్ కార్యాలయంలో గురువారం గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి తహశీల్దార్ ఎం.మెరకమ్మ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఒ చిన్ని, సీనియర్ అసిస్టెంట్ కమల్, జూనియర్ అసిస్టెంట్ భాను, సిబ్బంది పాల్గొన్నారు. **ఉండ్రాజవరం** శాఖా గ్రంథాలయం, జడ్‌పి ఉన్నత పాఠశాలలో తెలుగు భాష దినోత్సవాన్ని నిర్వహించారు. విశ్రాంత ఆంగ్ల భాష అధ్యాపకులు కోట రామప్రసాద్ మాట్లాడారు. తెలుగు వ్యావహారిక భాషను అందుబాటులోకి తెచ్చిన భాషా శాస్త్రవేత్త గిడుగు రామమూర్తి అని అన్నారు. తొలుత గిడుగు చిత్ర పటానికి పూలమాలవేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకులు గుత్తికొండ కృష్ణారావు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **గోపాలపురం** మండలంలోని చిట్యాల జిల్లా



కలెక్టరేట్‌లో కవులను సత్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, జెసి చిన్నరాముడు

పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీపాద లక్ష్మీనరసింహశాస్త్రి అధ్యక్షతన తెలుగు భాష, క్రీడా దినోత్సవాలను నిర్వహించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు గద్దె చంద్రశేఖర్, తెలుగు ఉపాధ్యాయులు కూన రమేష్, బేతాళ పద్మ, రాఘవకుమారి, సిఆర్‌పి కొయ్య నాగరాజు తదితరులు పాల్గొన్నారు. **సీతానగరం** పువ్వాడ సత్యమాంబ స్మారక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు భాష దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు కె.సతీష్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.వీరభద్రరావు గిడుగు రామ్మూర్తి, ధ్యాన్ చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పీడీ సింహాద్రి, శంకర్‌రావు, బ్రహ్మాజీ, సూర్యకుమారి, పుష్ప సరళ, ఉమాదేవి, నిర్మల రాజేశ్వరి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో గాయపడిన జర్నలిస్టు మృతి

ప్రజాశక్తి - కాకినాడ

తుని ఏరియాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జర్నలిస్టు యలమంచిలి శ్రీనివాసరావు గురువారం మృతి చెందాడు. గత 10 రోజుల క్రితం గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన ప్రమాదంలో శ్రీనివాసరావు తలకు తీవ్ర గాయమైంది. అప్పటి నుంచి ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందారు. మూడు రోజుల క్రితం కోలుకోవడంతో ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. అయితే గురువారం ఆరోగ్యం క్షీణించడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. చికిత్స ప్రారంభించిన కొద్ది సమయం లోగానే పరిస్థితి విషమించి మృతి చెందారు. శ్రీనివాసరావు మృతికి పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు, చింతపల్లి అజయ్ కుమార్, అంబటి రామకృష్ణ సంతాపం వ్యక్తం చేశారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని మామిడాడ గ్రామ శివారున రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ఐదుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.10,150 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పేకాట వంటి జూదాలు చట్ట విరుద్ధమన్నారు. మండలంలో అసాంఘిక కార్యక్రమాలు ఎక్కడ జరుగుతున్న సమాచారం తెలపాలన్నారు. అసాంఘిక శక్తులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో తల్లీ, కొడుకులకు గాయాలు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

జాతీయ రహదారి 216పై జరిగిన రోడ్డు ప్రమాదంలో గురువారం ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..కాకినాడ ఇంద్రపాలెంకు చెందిన వాసంశెట్టి అశోక్ గురువారం తన తల్లి నిర్మలను తీసుకుని మోటార్ సైకిల్ పై అమలాపురం వెళుతున్నాడు. ముమ్మిడివరం పంచాయతీ పరిధిలో కాశివాని తూము సెంటర్లో వీరిని వెనక నుంచి కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ నిర్మలను కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. స్వల్పంగా గాయపడ్డ అశోక్‌ను స్థానిక ఆసుపత్రిలో చేర్పించారు. ఎస్ఐ డి.జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సారా బట్టీలపై దాడి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని గోదావరి పరివాహక లంక ప్రాంతాల్లో నిర్వహిస్తున్న నాటు సారా బట్టీలపై పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 1500 లీటర్ల బెలం ఊటను ధ్వంసం చేశారు. 25 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. సారా తయారీకి ఉపయోగించే సామగ్రిని స్టేషన్‌కు తరలించారు. నిందితులను త్వరలో అరెస్టు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

6న జడ్‌పి సమావేశం

ప్రజాశక్తి - కాకినాడ

ఉమ్మడి తూర్పుగోదావరి జడ్‌పి సాధారణ సర్వసభ్య సమావేశం, స్థాయి సంఘాల సమావేశాలు సెప్టెంబర్ 6న స్థానిక జడ్‌పి సమావేశం మందిరంలో నిర్వహిస్తున్నట్లు జడ్‌పి సిఇఒ ఎ.శ్రీరామ చంద్రమూర్తి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహించే ఈ సమావేశానికి గౌరవ సభ్యు లు, అధికారులు సకాలంలో హాజరుకావాలన్నారు.

పింఛన్ల పంపిణీపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - గండేపల్లి

ఈనెల 31న లబ్ధిదారులకు అందించే పింఛన్ల పంపిణీ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఒ రామన్ అన్నారు. గురువారం పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లతో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 1వ తేదీన ఇవ్వాల్సిన పింఛన్లను 31వ తేదీనే అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కావున అందుకు అనుగుణంగా సిబ్బంది 31న ఉదయం 5.30 గంటల నుంచే పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

ఉపాధి హామీ రికార్డుల తనిఖీ

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

అమలాపురం క్లస్టర్ లోని ఉపాధి హామీ చట్టం పనులకు సంబంధించి మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనుల రికార్డులను తనిఖీ చేశారు. ఎంపిడిఒ కార్యాలయంలోని సమావేశపు మందిరంలో గురువారం ఉపాధి హామీ అధికారుల బృందం తనిఖీలు నిర్వహించారు. జాబ్ కార్డ్ లను వారు పరిశీలించి సక్రమంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తనిఖీ బృందంలో ఉపాధి ఎపిఒ కవిత, ప్లాంటేషన్ మేనేజర్ త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-కాట్రేనికోన

నేడు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మోకా రవికుమార్ గురువారం తెలిపారు. ఫీడర్లలో ఓవర్ లోడ్ కారణంగా వర్క్, చెట్లు తొలగింపు పనులు చేపడతారన్నారు. కాట్రేనికోన, వేట్లపాలెం, గచ్చ కాయల పొర, సిరయానం, కొండలేశ్వరం, గెద్దనాపల్లి, కొప్పిగుంట తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తారని తెలిపారు. **ముమ్మిడివరం** మండల విద్యుత్ ఉప కేంద్రం 33/11 కెవి ఫీడర్ల పరిధిలో మరమ్మతులు, ట్రీ కట్టింగ్ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఎపిఇపిడిసిఎల్ అమలాపురం డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవి కుమార్ గురువారం పేర్కొన్నారు. మండలంలో ముమ్మిడివరం ఆర్‌డబ్ల్యూఎస్ ఫీడర్ పరిధిలోని గ్రామాలు, అనాతవరం ఫీడర్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు.

నేత్రదాన పక్షోత్సవాలపై ర్యాలీ

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

అంగర పిహెచ్‌సిలో గురువారం జాతీయ నేత్రదాన పక్షోత్సవాలపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. సెప్టెంబర్ 8వ తేదీ వరకు నిర్వహించే పక్షోత్సవాలపై వైద్యాధికారి డాక్టర్ పిఎన్ ఎస్‌డి.రత్న కుమారి వైద్య ఆరోగ్య సిబ్బందితో అవగాహన సమావేశం నిర్వహించారు.

తేడా వస్తే సహించేది లేదు...

ప్రజాశక్తి - పెద్దాపురం


రికార్డులను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ భావన

రెవెన్యూ రికార్డుల భద్రతలో తేడా వస్తే సహించేది లేదని ట్రైనీ కలెక్టర్ భావన హెచ్చరించారు. గురువారం స్థానిక తహశీల్దార్, రిజిస్ట్రార్ కార్యాలయాలను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. కార్యాలయాల్లో ఉన్న రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా పరిధిలో ఉన్న అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో సంవత్సరాల తరబడి ఉన్న రికార్డులకు సంబంధించిన ఫైల్స్ అన్నీ భద్రంగా ఉంచాలన్నారు. ఎల్‌సిసి, అసైన్‌మెంట్ ల్యాండ్స్, ఇళ్ల స్థలాలకు సంబంధించిన రికార్డులను భద్రంగా ఉంచవలసిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. ఈ విషయంలో అజాగ్రత్తగా ఉన్న సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు. రాత్రిపూట రికార్డుల భద్రత కోసం ఇద్దరు సిబ్బందిని నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటలక్ష్మి, డిటి కాంతారావు, సిబ్బంది పాల్గొన్నారు.

వాణిజ్య పంటల సాగుతో అధిక ఆదాయం

ప్రజాశక్తి - ఏలేశ్వరం


రైతులకు మొక్కలను అందిస్తున్న ఎంఎల్ఎ సత్యప్రభ

వాణిజ్య పంటలను సాగు చేసుకోవడం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చునని ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ అన్నారు. గురువారం ప్రతిపాడులో ఉద్యానవన శాఖ, ఎపి ఆయిల్ ఫెడ్ సంయుక్తంగా నిర్వహించిన పామాయిల్ సాగు విస్తరణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వాణిజ్య పంటల సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా ఏలేశ్వరం, ప్రత్తిపాడు మండలాలకు చెందిన 483 మంది పామాయిల్ సాగు రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ మొత్తం రూ.81 లక్షలను అందజేశారు. జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి జివివి ప్రసాద్ మాట్లాడుతూ నూతనంగా పామాయిల్ సాగు చేసే రైతులకు నూరు శాతం రాయితీపై మొక్కలు అందించడం జరుగుతుందన్నారు. పామాయిల్ మొక్కల పెంపకంతోపాటు అంతర్ పంటల సాగుకు రూ.5250 చొప్పున నాలుగేళ్లపాటు రైతులకు రూ.21 వేలను అందజేస్తామన్నారు. వీటితోపాటు 5 ఎకరాలలోపు రైతులకు 90 శాతం సబ్సిడీతో, ఐదు ఎకరాల పైబడ్డ రైతులకు 50 శాతం రాయితీతో బిందు సేద్యం, తుంపర్ల సేద్యం యంత్రాలను అందజేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని వాణిజ్య పంటల రైతులు వినియోగించుకోవాలని కోరారు.

ఇకెవైసిని పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

ఈక్రాప్ అయిన రైతులకు వెంటనే ఇకెవైసిని పూర్తి చేయాలని ఎడిఎ నల్లి దైవకుమార్ సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తహశీల్దార్ వెంకటలక్ష్మి అధ్యక్షతన విఆర్‌ఒలు, రైతు కేంద్రాల సిబ్బందికి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకుని త్వరిత గతిని రికార్డులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.సంజయ్‌కుమార్, మండల వ్యవసాయ విస్తరణ అధికారి ఎన్‌వివి.ప్రసాద్ పాల్గొన్నారు.

మహిళలు, చిన్నారుల రక్షణ కోసం పాదయాత్ర

ప్రజాశక్తి - కాకినాడ



బృందానికి స్వాగతం పలుకుతున్న ఎస్ఎఫ్ఐ, ఆర్యవైశ్య సంఘ నాయకులు

మహిళలు, చిన్నారులకు ప్రతీ ఒక్కరూ రక్షణగా నిలవాలని, వారిపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, కలకత్తాలో వైద్య విద్యార్థులపై జరిగిన దాడిని ఖండిస్తూ విజయవాడ నుంచి కోల్‌కత్తాకు పాదయాత్ర చేపట్టారు. అకెట్ బుచ్చిబాబు, ఈడిగ ప్రదీప కుమార్, డి.రాధాకృష్ణ 1400 కిలోమీటర్లు చేపట్టిన పాదయాత్ర గురువారం కాకినాడ ఇంద్రపాలెం లాకుల వద్దకు చేరుకుంది. ఈ యాత్రకు భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ), ఆర్యవైశ్య సంఘం నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పాదయాత్ర బృందం సభ్యులు మాట్లాడుతూ కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన అకృత్యం ఘోరమైనదని, ఆమెకు న్యాయం చేయాలని సమాజంలో మహిళలు, చిన్నారిపై జరిగే దాడులను అరికట్టాలని తాము పాదయాత్రను చేపట్టామన్నారు. ఈ యాత్రకు మద్దతు పలికిన ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగా సూరిబాబు, ఆర్యవైశ్య సంఘం నాయకురాలు నాళం ఆండాళ్ మాట్లాడుతూ నేటి సమాజంలో కొందరు యువకులు తమ స్వార్థం కోసం విచ్చలవిడితనంగా తిరుగుతున్నారని అన్నారు. సమాజంలో మహిళలకు రక్షణ కల్పించాలని ముగ్గురు యువకులు చేస్తున్న పాదయాత్ర అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కాకినాడ అధ్యక్షులు సంజయ్, ఆర్యవైశ్య సంఘం నాయకులు రజిని, కౌశిక్, సునిత, సుజాత, అంబిక పాల్గొన్నారు.

ఆర్ అండ్ బి రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి - కోటనందూరు


రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

నర్సీపట్నం నుంచి తుని వెళ్లే ప్రధాన రహదారిలోని కాకరపల్లి గ్రామ శివారున గోతులు పడిన రోడ్డుకు మరమ్మతు పనులను గురువారం చేపట్టారు. గ్రామ జనసేన నాయకులు తాతాజీ, రాజు, ధనాజీ, అమల తదితరులు రోడ్డు దుస్థితిని అర్ అండ్ బి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆర్ అండ్ బి అధికారులు స్పందించి గురువారం రోడ్డుకు మరమ్మతు పనులు చేపట్టారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

క్రీడల్లో ఉత్తమ ప్రతిభను చాటుకుంటున్న ఉప్పాడ జడ్‌పి హైస్కూల్‌కు చెందిన క్రీడాకారులకు వాకర్స్ క్లబ్ సభ్యులు బంధన వీరమణికంఠ, చోడిశెట్టి సతీష్, కొవ్వూరి విజయ్ క్రీడ దుస్తులను గురువారం అందించారు. క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులను ప్రోత్సహించే లక్ష్యంతో వారికి అవసరమైన దుస్తులను అందించినట్లు వాకర్స్ క్లబ్ సభ్యులు, దాత బంధన వీరమణికంఠ అన్నారు. ఆటల్లో రాణిస్తున్న వారిని ప్రోత్సహించేందుకు వాకర్స్ క్లబ్ ముందు ఉంటుందన్నారు. క్రీడల పట్ల మక్కువ చూపుతున్న విద్యార్థులకు ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ఉప్పాడ పాఠశాల విద్యార్థులు స్టేట్ లెవెల్ ఛాంపియన్స్ షిప్‌లో రాణించేలా తీర్చిదిద్దాలని పిటి ఉపాధ్యాయులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి ఛైర్మన్ వనమాడి తాతబ్బాయి, సికోటి బుజ్జి, స్పోర్ట్స్ అధ్యక్షుడు వంక దానియేల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులకు పొలంబడి ద్వారా అవగాహన

ప్రజాశక్తి - గండేపల్లి, జగ్గంపేట

గండేపల్లి గ్రామంలో గురువారం గాప్ పొలంబడి(మంచి వ్యవసాయ పద్ధతులు) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సద్గురుమూర్తి పాల్గొని పురుగు మందులు విషతుల్యంపై గుర్తులను చూపించి అవగాహన కల్పించారు. రైతులెవరూ మోతాదుకు మించి ఎట్టి పరిస్థితుల్లోనూ వాడరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రమ్య మాట్లాడుతూ నేలను 365 రోజులు అచ్ఛేదనం ద్వారా కప్పి ఉంచడం వల్ల నేల భౌతిక ఆరోగ్యాన్ని రంక్షించుకోవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు కంటిపూడి రామారావు, విఎఎ అంజలి, విహెచ్ఎ ఉదయ్, రైతులు పాల్గొన్నారు. అలాగే జగ్గంపేట మండలంలోని గొల్లలగుంటలో గురువారం మండల వ్యవసాయాధికారి రెడ్ల శ్రీరామ్ ఆధ్వర్యంలో పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మెనేజ్‌మెంట్‌లో భాగంగా లింగకర్షక బుట్టలు, పక్షి స్థావరాలు ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించారు. లింగకర్షణ బుట్టలు తెల్ల దోమ, నల్ల దోమ, పచ్చ దోమతోపాటు రకరకాల దోమలను ఆకర్షిస్తాయని అన్నారు. ఈ ప్రక్రియ ద్వారా ఎటువంటి దోమలు బెడద ఎక్కువగా ఉందో గుర్తించి వాటికి క్రిమి సంహార మందులు వాడవచ్చన్నారు. ఎకరానికి 10 బట్టలు చొప్పున ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో బీజామృత్తం తయారు చేయడాన్ని రైతులకు డెమో ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లరేవులో వైద్య శిబిరం

ప్రజాశక్తి - తాళ్లరేవు



రక్తదానం చేస్తున్న విద్యార్థిని

గాడిమొగ పిహెచ్‌సి వైద్యులు తాళ్లరేవులో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సిహెచ్‌సిలో రక్త పరీక్షా విభాగం వద్ద గంటల కొలదీ ఉండాల్సివస్తుందని, జూనియర్ వైద్యులచే వైద్య సేవలు అందిస్తున్నారంటూ వైద్య శిబిరం వద్ద సిబ్బందిని స్థానికులు నిలదీశారు. స్థానిక సమస్యలను వైద్యాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఎంపిహెచ్‌ఎస్ బొడ్డు కుమార్ హామీ ఇచ్చారు. అనంతరం శిబిరానికి వచ్చిన వారికి అవసరమైన మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వి.లక్ష్మి, ఎఎన్ఎంలు రోజా, జ్యోతి, వెంకటరత్నం, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సెప్టెంబర్ మూడో వారంలో రాజధానికి ర్యాలీ

కాకినాడ రూరల్: గ్రామాల విలీనం ప్రక్రియ పూర్తి చేయాలని కోరుతూ సెప్టెంబర్ మూడో వారంలో ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయానికి ద్విచక్ర వాహన ర్యాలీని నిర్వహించనున్నట్లు పౌర సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అంతకుముందుగా నగర సదస్సును నిర్వహిస్తామని ప్రకటించారు.

ఇసుక తరలించిన వారిని అరెస్టు చేయాలి

వైసిపి నాయకుల ధర్నా

ప్రజాశక్తి-రామచంద్రపురం

జగనన్న కాలనీలో మంగళవారం రాత్రి 70 లారీలు ఇసుక పట్టుకు వెళ్ళిపోవడంపై వైసిపి శ్రేణులు గురువారంమోటార్‌సైకిల్ ర్యాలీ, ధర్నా కార్యక్రమాలు నిర్వహించారు. వెల్ల సావరం గ్రామంలో జగనన్న కాలనీలో నిరుపేదల ఇల్లు కోసం గృహనిర్మాణ శాఖ నిల్వ ఉంచిన ఇసుక నిల్వలను అక్రమంగా తరలించక పోయిన అధికార టిడిపి నాయకులను అరెస్టు చేయాలని వైసిపి ఇంఛార్జ్ పిల్లి సూర్యప్రకాష్ డిమాండ్ చేశారు. వెల్లసావరం వద్ద ఇసుక తరలించిన ప్రాంతను ఆయన స్వయంగా పరిశీలించి నిరసన కార్య క్రమంలో పాల్గొన్నారు. అధికారులు సూచించిన పేర్లు పై నిందితులను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ధర్నా కార్యక్రమంలో వైసిపి నాయకులు పెట్టా శ్రీనివాస్, ఇంత సంతోషం, కట్టా సూర్యనారాయణ, గాదంశెట్టి శ్రీధర్, అనసూరి సాయిబాబు, ం నియోజకవర్గ వైసిపి కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇసుక దోపిడీకి పాల్పడింది వైసిపి వారే : టిడిపి

వెల్లసావరం జగనన్న కాలనీ వద్ద ఇసుక దోపిడీకి పాల్పడింది వైసిపి వాళ్లేనని టిడిపి నాయకులు తెలియజేశారు. గురువారం వెల్లసావరం దోపిడీకి గురైన ప్రాంతం వద్ద టిడిపి నాయకులు టేకుమూడి సత్యనారాయణ మాట్లాడుతూ వైసిపి ఇన్చార్జి పిల్లి సూర్య ప్రకాష్ ఆరోపణలు అవాస్తవమన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గరిగిపాటి సూర్యనారాయణ, చింతపల్లి వీరభద్రరావు, కడియాల రాఘవన్, కావాలా నానాజీ తదితరులు పాల్గొన్నారు

తహశీల్దార్ల బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో పలు మండలాల్లో గురువారం తహశీల్దార్లు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయా కార్యాలయాల సిబ్బంది తదితరులు వారికి శుభాకాంక్షలు తెలిపారు. **అయినవిల్లి**: నూతన తహశీల్దారుగా సిహెచ్.నాగ లక్ష్మమ్మ గురువారం బాధ్యతలు బాధ్యతలు చేపట్టారు. ఆమెకు కార్యాలయ సిబ్బంది తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. **మామిడికుదురు :** తహశీల్దార్‌గా మృత్యుంజయరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు విఆర్‌ఒలు, కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. **ఆలమూరు:** తహశీల్దార్‌గా కెజె.ప్రకాష్ బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. మండల విఆర్‌ఒలు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

అంబేద్కర్ జీవితం ఆదర్శనీయం

ప్రజాశక్తి-కొత్తపేట

రాజ్యాంగ నిర్మాత, భారతరత్న, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జీవితం ఆలోచనా విధానం నేటి తరానికి ఆదర్శనీయమని అమలాపురం ఎంపీ హరీష్ మాధుర్, కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావులు వ్యాఖ్యానించారు. కొత్తపేట పరిధిలోని అంబేద్కర్ కాలనీ లో గురువా అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బూసి జయలక్ష్మి, భాస్కరరావు, పల్లి భీమరావు, కంఠంశెట్టి శ్రీనివాస్, సరేలా రాజబాబు, బహుదూర్, బండారు వీరబాబు, అంబేద్కర్ కాలనీ పెద్దలు మరియు తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి

ప్రజాశక్తి-ముమ్మిడివరం

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా సహాయ కార్మిక అధికారి కెబిఆర్.శర్మ (రాజోలు)(ఎఫ్ఎసి)పిలుపునిచ్చారు. చైల్డ్ లేబర్ డ్రైవ్ లో భాగంగా గురువారం ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని పలు షాపులు, హెూటల్స్ లలో సహాయ కార్మిక అధికారి బృందం ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. పలువు అధికారులు పాల్గొన్నారు.

వినాయక చవితి ఉత్సవాలకు రాట ముహూర్తం

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

అంగరలో సెప్టెంబర్ 7న ప్రారంభమయ్యే వినాయక చవితి ఉత్సవాలకు గురువారం రాట ముహూర్తం చేశారు. అంగర ఆది గణపతి సెంటర్లో ఆలయ కమిటీ ఛైర్మన్ పెద్దింశెట్టి సూరిబాబు, రాటకు పూజలు నిర్వహించి రాట ముహూర్తం చేశారు. కార్యక్రమంలో మేడేపల్లి కొండ, పెద్దింశెట్టివీరబాబు, పసలపూడి కష్ణ, కొండిపూడి శ్రీరాములు, ఎర్రం శెట్టి రమణ ,మేక భద్రరావు, యానాల సుబ్బారావు, అచ్చన్న, పడాల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్‌సి ఎన్నికల విధి విధానాలపై అవగాహన

ప్రజాశక్తి-అంబాజీపేట

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లా ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికకు సంబంధించి ఎన్నికల కమిషన్ జారీ చేసిన విధివిధానాలపై అవగాహన పెంచుకోవాలని తహశీల్దార్ జె.వెంకటేశ్వరి అన్నారు. అంబాజీపేట తహశీల్దార్ కార్యాలయంలో గురువారం ఓటర్లుగా ఉపాధ్యాయుల నమోదు కోసం మండల విద్యా శాఖ అధికారులు, ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థల ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలోఎంఇఒలు హైస్కూల్, మండల హైస్కూల్ హెచ్‌ఎంలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రూ.10 లక్షల విలువైన మద్యం ధ్వంసం

ప్రజాశక్తి - ఆలమూరు

ఎస్ఇబి అధికారులు స్వాధీనం చేసుకున్న రూ.10 లక్షల విలువైన మద్యాన్ని గురువారం ధ్వంసం చేశారు. మండల కేంద్రంలోని ఎస్ఇబి కార్యాలయానికి జిల్లా ఎస్ఇబి, అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ జి.అమర్ బాబు గురువారం విచ్చేశారు. పలు అంశాలపై ఆయన మాట్లాడారు. అనంతరం ఆయన సమక్షంలో వివిధ కేసుల్లో పట్టుబడ్డ మద్యాన్ని స్థానిక ఓఎన్జిసి రిగ్ ఖాళీ ప్రాంతంలో ధ్వంసం చేశారు. వివిధ కేసులలో పట్టుబడ్డ 435 లీటర్ల సారాను పారబోశారు. . ఇంచార్జ్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎ.సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన కమిటీ ఏర్పాటు అభినందనీయం

ప్రజాశక్తి-కొత్తపేట

పలివెల ఉమా కొప్పులింగేశ్వర స్వామి ఆలయంలో ప్రతి సోమవారం సాధువులకు, యాత్రికులకు అన్నదానం ఏర్పాటు చేయడానికి అన్నదాన కమిటీ నియమించుకోవడం అభినందనీయమని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. అన్నదాన కార్యక్రమాన్ని 500 మందితో గురువారం ఆలయంలో ఎంఎల్ఎ చేతుల మీదుగా ప్రారంభింపచేశారు. కార్యక్రమంలో .తోట వెంకటేశ్వరరావు, మాస్టర్ ఆధ్వర్యంలో అన్నదాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన

ప్రజాశక్తి-ఆలమూరు

గుడ్ టచ్, బ్యాడ్ టచ్ లపై బాలికలకు అవగాహన తప్పనిసరిగా ఉండాలని రావులపాలెం రూరల్ సిఐ సిహెచ్.విద్యాసాగర్ అన్నారు. స్థానిక బొబ్బా జయశ్రీ గర్ల్స్ హైస్కూల్లో ఆలమూరు ఎస్ఐ ఎం.అశోక్ తో కలసి బాలికలకు వివిధ సైబర్ క్రైమ్ లపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం గురువారం ఆయన నిర్వహించారు.

వెంకన్న హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

వాడపల్లి వెంకన్న స్వామి వారి హుండీ ఆదాయాన్ని గురువారం ఆలయ ముఖ మండపంలో మందపల్లి దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి పర్యవేక్షణలో45 రోజులకు లెక్కించారు. ఈ లెక్కింపులో రూ.45,93,8,60, 23 గ్రాముల బంగారం, 350 గ్రాముల వెండి సమకూరయని ఆలయ డిసి భూపతి రాజు కిషోర్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకుడు శ్రీనివాస్, మండపేట గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణ అధికారి పివిఎస్.కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు తీర్పుపై నిరసన

ప్రజాశక్తి-రాజోలు

ఎస్‌సి వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును నిరసిస్తూ రాజోలులో మాలల న్యాయపోరాట సమితి, ఎస్‌సి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు సారథ్యంలో గురువారం ర్యాలీగా రాజోలు తహశీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని మానవహారం నిర్వహించారు తదుపరి తహశీల్దార్ కార్యాలయంలో మెమోరాండం అందించారు.

పంచాయతీల రెవెన్యూ తగాదాలపై సమీక్ష

ప్రజాశక్తి-ఆలమూరు

చొప్పెల్ల, చెముడులంక గ్రామాల మధ్య మూడు దశాబ్దాలుగా జరుగుతున్న రెవెన్యూ సరిహద్దుల ఆస్తి పంపకాల తగాదాలపై ఇప్పటికీ కొలిక్కి రాలేదు. చొప్పెల్ల సర్పంచ్ దంగేటి చంద్రకళ బాపణయ్య, చెముడులంక సర్పంచ్ తమ్మన శ్రీనివాసుతో పాటు రెండు గ్రామాల ముఖ్య పెద్దలతో వేర్వేరుగా ఇంచార్జ్ డిఎల్పిఓ ఐదం రాజు గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. రెండు గ్రామాల వారుచెప్పిన విషయాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆయన తెలిపారు.